క్లుప్తంగా

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

నెహ్రూనగర్: ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ సంయుక్త ఆధర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సింక్రోసర్వ్ సెంటర్ హెడ్ ఎస్. కిశోర్‌బాబు తెలిపారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా కనీస విద్యార్హతతో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, సోలార్ టెక్నీషియన్‌తో పాటు టైలరింగ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొనారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బ్రాడీపేట 4/15, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో లేదా 9390713161, 9100064573 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జూన్ 1 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలియజేశారు.

శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థిని డి. పల్లవి క్రీడాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సమాజంలో మెలిగే అంశాలపై వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట ఎస్‌హెచ్‌వోగా అన్వర్ బాషా



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా షేక్ అన్వర్ బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2007లో ఎస్‌ఐగా చేరిన ఆయన నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేశారు. 2016లో సీఐగా పదోన్నతి లభించింది. అనంతరం నెల్లూరు, వెంకటగిరి, సీఐడీల్లో పనిచేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఆయన్ను కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు పని చేసిన సీఐ శీలం శ్రీనివాసులరెడ్డిని వీఆర్‌కు పంపుతూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామిని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ నరసింహ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, అర్చకులు అయోధ్య అయ్యప్ప, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత శివకుమారి పాల్గొన్నారు.

38 వాహనాలపై కేసులు



పట్నంబజారు: కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాహనాలకు కాలుష్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ మిషన్ లైఫ్‌లో భాగంగా కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న 38 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలు జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు ఈస్ట్: భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజవాడ సుకన్యకు, కొర్నేలుకు 12 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో సుకన్య తుఫాన్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తలు ఫోన్‌లో గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొర్నేలు, అతని తల్లిదండ్రులు సుకన్య నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో రెండు కుటుంబాలు పరస్పరం గొడవపడి దాడి చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్య, వైద్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి
- బీఆర్ స్టేడియం వద్ద అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి విద్యా, వైద్యానికి ఎంతో ప్రాధాన్యతిస్తున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. బీఆర్ స్టేడియం సమీపంలో మంగళవారం రూ 1.24 కోట్లతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక హంగులతో అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తోందన్నారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ పాటుపడుతున్నారని తెలిపారు. పేద ప్రజలకు అవసరమైన ప్రతి చోట అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత ఆరోగ్య కేంద్రంలో 10 బెడ్స్, 38 రకాల రక్త పరీక్షలతో పాటు ప్రాథమిక చికిత్స అంతా అందిస్తారని పేర్కొన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, ఆరోగ్యం, విద్య, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతున్నాయని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా 560 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తున్నారని, వాటిలో గుంటూరులో 16 ఉన్నట్లు తెలిపారు. ఒక్కొ హెల్త్ సెంటర్‌కు రూ. కోటి మంజూరు చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే నగరంలో 10 సెంటర్ల మరమ్మతులకు రూ 10లక్షల చొప్పున మంజూరు అయినట్లు తెలిపారు. మధ్య, పేద వర్గాలకు ఆరోగ్యపరంగా బాసటగా నిలిచేలా సీఎం జగన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని కొనియాడారు. హెల్త్ సెంటర్లలో ఆపరేషన్ల మినహా అన్ని వైద్య చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ కళ్యాణరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

అదనపు కమిషనర్ పెద్ది రోజా



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న అదనపు కమిషనర్

నెహ్రూనగర్: సీఎం పర్యటన విజయవంతం చేయడానికి నగరపాలక సంస్థ నుంచి అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ పెద్ది రోజా అధికారుల్ని ఆదేశించారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జూన్ 2న గుంటూరు నగరంలోని చుట్టగుంట వద్ద వైఎస్సార్ యంత్ర సేవా పథకం రెండో విడతలో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేస్తున్న క్రమంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు సూచించారు. ఆమె మంగళవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్, జిల్లా పరిషత్ రోడ్డు, చుట్టగుంట సెంటర్‌ని పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ అధికారులుకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభా వేదిక ఏర్పాటు చేయనున్న చుట్టగుంట ప్రాంతాలతో పాటు పెరేడ్ గ్రౌండ్ నుంచి చుట్టగుంట జంక్షన్ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. డివైడర్ పక్కన మట్టి కుప్పలు తొలగించాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ప్రత్యేకంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులకు బాధ్యతలు కేటాయించాలని చెప్పారు.సభా వేదిక పరిసరాల్లో పక్కాగా ఫాగింగ్ చేపట్టాలని బయాలజిస్ట్‌ని ఆదేశించారు. రోడ్ల పక్కన ఆక్రమణలు, సభావేదికకు అడ్డుగా ఉండే కేబుల్ లైన్లు, అనధికార హోర్డింగ్స్ తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో రోడ్ల మీద పాట్ హోల్స్‌ను బుధవారం నాటికి మరమ్మతు చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే రైతులకు తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. చుట్టగుంటకు వెళ్లే మార్గంలోని పీకల వాగులో పూడికతీత చేపట్టాలని చెప్పారు. నగరపాలక సంస్థ విభాగ అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, సోమశేఖర్, ఆయూబ్‌ఖాన్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన



కేక్ కటింగ్ చేస్తున్న ఆచారి, పార్టీ నేతలు

పట్నంబజారు: పరిపాలన అంటే ఎలా ఉండాలో, చేసి చూపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) చెప్పారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ పరిపాలన చేపట్టి నాలుగేళ్లు గడిచిన నేపథ్యంలో మంగళవారం బ్రాడీపేటలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆచారి మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తాను పేదల పక్షపాతినని జగన్ చాటిచెప్పారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఆయన్ని తిరిగి సీఎంని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు రత్నప్రసాద్, బందా రవీంద్రనాథ్, విజయలక్ష్మి, విజయమాధవి, విజయమ్మ, వెంకటరమణ, డేవిడ్, గులేషా, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్, గణేష్ పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

గుంటూరు మెడికల్: శ్రీకృష్ణ యాదవ సేవా సమితి గుంటూరు ఆధ్వర్యంలో 2023లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి గుంటూరు జిల్లా యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, అంత కన్నా ఎక్కువ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన మొదటి 100 మందికి రూ. 3వేలు చొప్పున, తరువాత 100 మందికి రూ. 2వేలు చొప్పున, మిగిలిన అందరికీ రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు, ప్రతి ఒక్కరికీ కాలేజీ బ్యాగ్ అందిస్తామని వివరించారు. గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో జూన్ 6న ఉదయం 10 గంటలకు జరిగే యాదవ విద్యార్థుల కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంలో ఈ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డి. రవీంద్ర, ఇస్రో సైంటిస్ట్ దేవరాల కళ్యాణ చక్రవర్తి, హైకోర్టు న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్, ఏలెన్ విద్యాసంస్థల అధినేత మహేష్ యాదవ్, ప్రొఫెసర్ కొమ్మా వేణుగోపాల్, చిమటా శివకుమార్ అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.

జగన్ పాలన స్వర్ణ యుగం



వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి, ఉద్యోగ సంఘాలు

ఏఎన్‌యూ: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలన స్వర్ణ యుగమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైఎస్సార్ విద్యార్థి, ఉద్యోగ, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ విద్యార్థి, ఉద్యోగ, యువజన సంఘాల నాయకులు మంగళవారం యూనివర్సిటీలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఏఎన్‌యూ శాఖ మాజీ అధ్యక్షుడు భాను రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్, వికాస అధ్యక్షుడు అనిల్ కుమార్, సీఈ నరసారెడ్డి, ఏసీఈ రెడ్డి ప్రకాష్, వికాస సెక్రటరీ కె.శ్రీనివాస రావు, రంగారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు రవికుమార్, నాయకులు జమ్మి రెడ్డి, సునీల్, సతీష్, కుమార్, రాజశేఖర్, ప్రవీణ్, చంద్ర పాల్గొన్నారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

పట్నంబజారు: బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన తాడేపల్లి కృష్ణచైతన్య ఈ నెల 26న గుంటూరుకు ఒక శుభకార్యం నిమిత్తం వచ్చారు. ఇక్కడ దిగి చూసుకునే సరికి బ్యాగు కోసి ఉండటాన్ని గమనించారు. అందులోని 145 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే ముస్తఫా



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, డెప్యూటీ మేయర్ వనమా తదితరులు

పట్నంబజారు: వలంటీర్ల సేవలు అభినందనీయమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని 550,53,56,55 డివిజన్ల వలంటీర్లను సత్కరించి, అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి మానసపుత్రిక సచివాలయ వ్యవస్థ అన్నారు. వలంటీర్ల సేవలపై ఆయనకు ఎంతో నమ్మకమని చెప్పారు. వలంటీర్లను సన్మానించి, పురస్కారాల్ని అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్ పరిపాలన చేపట్టి నాలుగేళ్లు గడిచిన సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ నేత నూరి ఫాతిమా, కార్పొరేటర్లు వంశీ, అంబేడ్కర్, కనక దుర్గ, రవి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తూర్పు నియోజకవర్గంలోని 57వ డివిజన్ కాకాని రోడ్డులో సీసీ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా, కార్పొరేటర్ పఠాన్ రిహానా మాట్లాడుతూ రూ. 17లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ నూర్‌ఖాన్, పార్టీ నేతలు పల్లా శ్రీను పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నియోజకవర్గంలోని 2వ డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి ఆధ్వర్యంలో మంగళవారం కాకాని రోడ్డులో మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరి ఫాతిమా ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం

పాత గుంటూరు: ఆర్టీసీ గుంటూరు– 2 డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మేనేజరు షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, సమస్యల్ని తెలుసుకున్నారు.

- గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు మంగళగిరి స్టేజి ఏర్పాటు చేయాలని ఆ పట్టణానికి చెందిన.సాంబశివరావు కోరారు.
- మణిపురం బ్రిడ్జి వద్ద విజయవాడ వెళ్లే బస్సులు ఆపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, దాన్ని కంట్రోల్ చేయమని గుంటూరుకు చెందిన శంకర్ కోరారు.
- గుంటూరు నుంచి విశాఖపట్నం, హైదరాబాద్‌కు ఏసీ స్లీపర్ బస్సులు ఏర్పాటు చేయాలని పాత గుంటూరుకు చెందిన కిశోర్ కోరారు.
- గుంటూరు నుంచి ఉదయగిరికి వయా ఒంగోలు, కందుకూరు, వింజమూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరుకు చెందిన వీరవల్లి బ్రహ్మయ్య కోరారు.

సివిల్స్ ర్యాంకర్ సుభాష్‌కు సత్కారం



సుభాష్‌ను సత్కరిస్తున్న భ్రమర అధినేత గల్లా రామచంద్రరావు, డైరెక్టర్లు

పాత గుంటూరు: సివిల్స్ సర్వీసెస్ పరీక్ష ఫలితాలలో 825 ర్యాంకు సాధించిన గుంటూరుకు చెందిన కొరిటిపాటి హృదయరాజు తనయుడు కె. సుభాష్‌ను మంగళవారం శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కల్పించి లక్ష్యం సాధించే ప్రయత్నంలో దృఢ సంకల్పంతో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని తెలిపారు. జనచైతన్య సంస్థ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ నిజాయతీ సమాజానికి మేలు చేస్తుందని తెలిపారు. మేకపాటి దయాసాగర్ మాట్లాడుతూ ఐఏఎస్ సాధించే వరకు మరింత పట్టుదలతో ముందుకుసాగాలని తెలిపారు. కార్యక్రమంలో భ్రమర డైరెక్టర్లు కోట శైలరెడ్డి, ఎల్.పి. రాజు, మురళీకృష్ణ, సీహెచ్. సతీష్‌బాబు, పి. నరేష్, బి. సాయిశంకర్, సుభాష్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళరావునగర్‌లో నివసించే ఓ కుటుంబం సోమవారం రాత్రి వేసవి కాలం కారణంగా ఇంటి తలుపులు దగ్గరకు వేసి నిద్రించింది. మద్యం మత్తులో తెల్లవారుజామున కొక్కిలిగడ్డ అంకమ్మరావు ఇంట్లోకి జొరబడి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేసింది. దీంతో భర్త, స్థానికులతో కలసి అంకమ్మరావుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

పెదకాకాని: బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. మండలంలోని నగరపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుమార్తె అదృశ్యంపై కలత చెందిన తండ్రి మనస్తాపంతో ఈనెల 29న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదృశ్యమైన బాలిక ఆచూకీ కోసం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎస్పీగా అనీల్‌కుమార్ సేవలు ప్రశంసనీయం



ఏఎస్పీ అనీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎస్పీ



అర్జున్‌రావుకు అభినందనలు

నగరంపాలెం: ఏఎస్పీగా అనీల్‌కుమార్ సేవలు మరువలేమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అన్నారు. గుంటూరు నుంచి బదిలీపై వెళ్తున్న అనీల్‌కుమార్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలోని స్పందన హాలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యమంత్రి బందో బస్తు, తాడేపల్లి క్యాంపు కార్యాలయం, అసెంబ్లీ సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు వంటి కార్యక్రమాల్లో సమర్థంగా విధులు నిర్వహించారని తెలిపారు. ముఖ్యమైన కేసుల్లోనూ దర్యాప్తు అధికారిగా మంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఏఎస్పీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వర్తించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఎస్.షెల్కే (తూర్పు), శ్రీనివాసరావు (క్రైం), కె. సుప్రజ (పరిపాలన), కె.శ్రీనివాసరావు (ఎల్‌అండ్‌వో), డి.ఎస్. మహేష్ (ఎస్ఈబీ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మరెన్నో పతకాలు సాధించాలి

పోలీస్ శాఖ తరఫున పోటీల్లో పాల్గొని మరెన్నో పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ సూచించారు. తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అర్జున్‌రావుని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీపీఓ ఆవరణలో ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన), ఎస్‌బీ డీఎస్పీ సుభాష్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు పంపిణీ

నగరంపాలెం: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే పి.శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలవ్వగా ఈనెల 11న మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన భార్య నాగకుమారికి విత‌ంతు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.75 వేల చెక్కుని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలో ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఎస్‌బీ డీఎస్పీ సుభాస్ పాల్గొన్నారు.

సందడిగా ఎంబీఏ హెచ్‌ఏ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రసంగిస్తున్న యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ నాగరాజు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, ఎంబీఏ హెచ్‌ఏ విభాగాధిపతి డాక్టర్ బి. నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ కోర్సు చదివిన విద్యార్థులు అనేక ప్రభుత్వ, కార్పొరేట్ వైద్య రంగాల్లో ఉన్నత స్థాయిల్లో ఉపాధి అవకాశాలు పొందారని చెప్పారు. హాస్పిటల్ రంగంలో విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ విభాగాభివృద్ధికి వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లడుతూ తాము అనేక రంగాల్లో అవకాశాలు పొందడానికి ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు కారణమని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సంఘ కార్యవర్గం

పూర్వ విద్యార్థుల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ బి. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పి. ఆనంద్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ సీహెచ్. రాజీవ్ , కోశాధికారిగా ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్ కన్సల్టెంట్ ఎ. వాసుబాబు, జాయింట్ సెక్రటరీగా కె. దిలీప్, లేడీ రెప్రజెంటేటివ్‌గా ఎం.ఎస్. అనూష ఎంపికయ్యారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్, ఎం.ఆర్. డేవిడ్ రాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.